


వక్కంతం భారతి

**యజ్ఞారాయణ శాస్త్రి ప్రాణం పోయిందిట - ఊరు ఊరంతా గుప్పుమంది.**

**జనాల నోళ్ళో ఆ కుటుంబం నానడం అది రెండోసారి.**

**యజ్ఞారాయణ శాస్త్రి ఒక్కగానొక్క కూతురు గాయత్రి మురికివాడలోని కొండన్నను గుళ్ళోపెళ్ళి చేసుకున్న వార్త రేపల్లంతా దావానలంలా వ్యాపించినప్పుడు మొదటిసారి అలాగే గుప్పుమంది.**

యజ్ఞారాయణ శాస్త్రి ముందుకానీ, వెనుక కానీ ఆ విషయం బహిరంగంగా చర్చించే ధైర్యం ఆ ఊళ్ళో ఎవరికీ లేదు. అందుకే రహస్యంగా చెవులు కొరుక్కోవటంతో సంతృప్తి పడిపోయారు. ఇప్పుడూ అంతే, గాయత్రి వివాహమే ఆయన్ని మానసికంగా కృంగదీసి, ప్రాణాలు బలికొందని ఊహాగానాలు చేసుకుని ఆనందించారు.

ఊళ్ళో ఆయన్ని గౌరవించే వాళ్ళెంతమందో, ఆయన మొండితనమన్నా, ఎవరికీ తలవంచనీ జవాబు ఇచ్చుకోనీ తత్వమన్నా పొడగిట్టని వారు కూడా అంతే మంది. ఆయన శ్రోత్రియుడూ, వేద పారంగతుడే కాదు, హేతువుని కూడా నమ్మినవాడు. కూతురికి కాళిదాసు కుమారసంభవంతో పాటు ఇంగ్లీషు చదువులు కూడా చెప్పించాడు.

సంస్కృతమే కాదు, సంస్కారము కూడా ఆమెకి పెట్టని ఆభరణం.

చెల్లెలు పెద్ద చదువులు చదవడం ఆమె అన్నయ్యలెవరికీ ఇష్టం లేదు. చదువు అబ్బక వ్యవసాయంలోకి పెద్దవాడూ... అబ్బిందానికే మురిసిపోయి గొర్రెతోక సర్కారీ కొలువులోకి రెండోవాడు, .. వేదమూ, డిగ్రీ రెండూ సరిపడక కొట్టుమిట్టాడుతూ వున్న చిన్నవాడు...

చెల్లికి ఏదో ఒక సంబంధం చూసి ముడిపెట్టేసి, బాధ్యత వదిలించుకుని ఆ లోగిలిని, పొలాన్ని వాటాలు పంచుకుందామన్న ఆలోచన ఆ ముగ్గురికీ వుంది. వాళ్ళకు తగినట్టు వాళ్ళ పెళ్ళాలు ". .. ఆడపిల్ల ఇంకా ఎంతకాలం చదువులని, ఉద్యోగాలనీ ఊళ్ళెంబడి తిరగడం? ఆ ముసలాయనకు లేకపోతే మీకైనా జ్ఞానం వుండొద్దూ, ఎప్పటికైనా మనం వదిలించుకోవాల్సిన బాధ్యతే కదా! ఆ చిన్న శాస్త్రులు బానే వుంటాడు, ఆ కుర్రాడిని కదిపి, కుదిరితే- ఈ మాఘంలో చేసేద్దాం. మనకూ పిల్లలున్నారు, ఎంతకాలం అత్తగారింటి గురించి ఆలోచించమంటారూ?" అని మొగుడిని పోరే పెద్దొదిన.

"అయ్యో! ఎవరిదాకో ఎందుకమ్మా? మా తమ్ముడే వున్నాడు కదా, డిప్లొమా ఇంజనీర్ చేస్తున్నాడు. ఓ రెండుసార్లు పరీక్ష తప్పాడనుకో, అయినా మొగుడి జీతం మీద ఆధారపడడానికి మీ చెల్లెలు మాలా చదువులేనిదా ఏమిటి? వెలగబెడుతోందిగా లెక్చరరు ఉద్యోగం" అని సున్నాయి నొక్కులు నొక్కే చిన్నొదిన.

ఇవన్నీ తన కళ్ళ ముందే జరక్కపోయినా, గ్రహించగల తెలివితేటలున్న యజ్ఞారాయణ శాస్త్రికి ఆ ఇంట్లో తన హయామయిపోయిందని తెల్సిపోయింది. అయితే కొడుకులయినా, కోడళ్ళయినా ఆయన ఎదుటపడి మాట్లాడి ఎరుగరు.

*     *     *

ఆ ఇంట్లో ఆయన సన్నిధిలో కూర్చుని మాట్లాడగల చనువున్నది ఒక్క గాయత్రికే. తండ్రితో తప్ప ఇంట్లో మరింకెవ్వరితోనూ మాట్లాడతగ్గ విషయాలేవీ మితభాషిణి అయిన ఆమెకు తోచేవి కావు. గోదావరొడ్డున తండ్రికి కాస్త వెనగ్గా నడుస్తూ ఆముక్తమాల్య[illegible] గురించి మాట్లాడ్డం ఆమెకిష్టం. కొబ్బరాకుల మధ్యగా పడే వెండి వెన్నెల వెలుగులో కూతురందించే తమలపాకులు బుగ్గన పెట్టుకుని - కీట్స్ గురించి, తనకు పరిచయం లేని సాహిత్యం గురించి వినడం ఆయనకి సరదా.

టౌనులో వున్న జూనియర్ కాలేజీకి ఆమె బస్సులో వెళ్ళొచ్చేది. కొండన్న కూడా అదే కాలేజీలో లెక్చరరు. ఒకే బస్సులో వచ్చీ పోవడం వాళ్ళని సన్నిహితుల్ని చేసింది. ఆమె వ్యక్తిత్వం అతనికి, అతని ఆదర్శాలు ఆమెకీ నచ్చాయి. అంతకంటే వాళ్ళిద్దరి మధ్యా పెద్ద ప్రేమకథేం నడవలేదు.

ఆరోజే సంక్రాంతి. ముందు రాత్రి పెట్టిన ముగ్గులూ, గొబ్బిళ్ళూ, తులసి కోటలో వెలిగే దీపం, పూజ గదిలోంచి వినిపించే ఎమ్మెస్ సుబ్బలక్ష్మి గాత్రం, చెక్క గేటుకి ప్రక్కగా అల్లుకున్న పాదులోని గుమ్మడిపూలూ... అన్నింటి మధ్య నుంచి కొండన్నతో క్రొత్త జీవితం పంచుకోవడం కోసం నడిచెళ్ళిపోయింది గాయత్రి.

వధూవరులు పసుపు బట్టల్తో గుమ్మంలోకి అడుగు పెట్టగానే చేతిలో వున్న చేట వదిలేసి, నోరు తెరిచేసింది పెద్దకోడలు. తల మీద మట్టి పోసుకున్న పెద్ద కొడుకుని చితకబాదుతున్న చిన్న కోడలు శిలా ప్రతిమే అయ్యింది.

అందరూ తేరుకున్నాక, గాయత్రి ఊహించిందానికన్నా ఎక్కువ రభసే జరిగింది.

"అయ్యో.. అయ్యో... బంగారం లాంటి సంబంధాలు వెదుకుతూండగా, ఈ కులం లేనివాడే దొరికాడటే నీకు?" అని ఆరునొక్కరాగం ప్రారంభించింది చిన్న వదిన.

"కులభ్రష్టత్వం చేస్తాడా? ఎన్ని గుండెలువీడికి? వరికి పోగులు పెడతాను" చిందులు తొక్క సాగాడు పెద్దన్నయ్య.

"చదువొద్దు, పెళ్ళిచేయండీ అంటే ఒక్కరైనా పట్టించుకున్నారా? నా పిల్లల భవిష్యత్తు కన్నా ఎక్కువగా ఆదుర్దాపడ్డాను ఈ పిల్ల కోసం..." పెద్దొదిన బుడిబుడిరాగాలు యజ్ఞారాయణ చూసిన ఒక్క చూపుతో ఆగిపోయాయి.

ఆయన పెద్దగా ఏమీ మాట్లాడలేదు. అభావంగా "మీరందరూ లోపలికెళ్ళండి" అని మాత్రం అన్నాడు. ఆయన మనస్సులో ఏముందో అర్థంకాకపోయినా, ఆ కంఠంలోని గంభీరతకి తల వంచారందరూ.

అప్పుడు కూతురి కేసి తిరిగాడాయన. మేరువులా, పరమశివుడిలా అరుగు మీద నిలువెత్తు ఆయన శరీరం...

కాసేపు ఇద్దర్నీ తదేకంగా అలాగే చూసి "వెళ్ళిరా గాయత్రీ" అన్నాడాయన.

భక్తే తప్ప భయం వేయలేదామెకి. ఇద్దరూ ఆయన కాళ్ళకి నమస్కరించి వెళ్ళిపోయారు. కొండన్న గాయత్రి చేతిని అపురూపంగా అందుకోవడం ఆయన గమనించాడో లేదో మరి.

ఊరంతా అట్టుడికిపోయింది. ఏ ఇద్దరు చేరినా, ఈ విషయం గురించిన చర్చలే. ఆ

విషయమై ఎవ్వరితోనూ చర్చించనిది ఒక్క యజ్ఞనారాయణే. ఆయన మౌనమేంటో ఎవరికీ అంతు చిక్కలేదు. అది తుఫాను ముందరి ప్రశాంతత అని సరిపెట్టుకున్నారు. ఆయన సమయం చూసి, దీనికి తగిన విధంగా స్పందిస్తారనీ, కొండన్నకి బుద్ధి చెప్తారనీ ఊహాగానాలు చేస్తున్నారు.

ఖర్చు మిగిలిందనీ, బాధ్యత వదిలిందనీ ఇంట్లో అందరూ లోలోనే సంతోషించారు. పరామర్శ పేరుతో ఆరాలడిగే వాళ్ళ దగ్గిర బుడి బుడి రాగాలుతీయడం మాత్రం మర్చిపోలేదెవరూ.

*   *   *

తండ్రి పోయాడని తెల్సి గాయత్రి వచ్చింది కొండన్నతో కల్సి! గుండెలు పగిలేలా ఏడుస్తున్న వదినలు ఒక్కసారిగా ఆపేసారు. ఆ ఇంటి చుట్టూ చేరిన జనాలు బుగ్గలు నొక్కుకున్నారు. 'సిదప కాలం, చేసిన అవమానానికి తండ్రి కృంగి కృశించి చచ్చిపోతే, పశ్చాత్తాపంతో చావక, తగుదునమ్మా అని చూడవచ్చింది' అని గుసగుసలాడుకున్నారు.

ఆమెనెవ్వరూ ఇంట్లోకి రానివ్వలేదు. ఈ ఇంటితో నీకు సంబంధాలు తెగిపోయాయన్నారు. గుమ్మం తొక్కడానికి వీల్లేదన్నారు. నువ్విక్కడ్నుంచి పోతే కానీ క్షోభించిన ఆత్మ శాంతించదన్నారు. నీలాంటి కూతురు పగవాడికి కూడా పుట్టకూడదన్నారు.

అవతల చిన్నోదిన మామగారు చివరి దశలో ఎంత కుమిలిపోయారో కథలుగా చెప్తోంది. అక్కడ దుఃఖం కంటె ఎక్కువ అక్కసే కన్పించింది.

అంతమందిలోనూ దుఃఖాన్ని మర్చిపోనిది ఒక్క గాయత్రే. ఆమెకి ఎవరి మాటలూ తలకెక్కట్లేదు.

అడుగుల చప్పుడులో ఢమరుకం పలుకుతుంటే, సంధ్యా వందనానికి గోదావరొడ్డుకి నడిచెళ్ళే ఆయనా, తల్లి పోయాక తనను ఒళ్ళో కూర్చోబెట్టుకుని గోరుముద్దలు తినిపిస్తూ చందస్సు నేర్పిన తండ్రి, ఎన్ని నియమాలున్న మనిషైనా ఎప్పుడూ ఎవరిమీదా తన అభిప్రాయాలు రుద్దని విశాల హృదయుడు.

...ఆమె దుఃఖం గుండెను దాటి కళ్ళు చేరలేదు. విషాదం... దుఃఖం కన్నా అతీతమైన స్థితి.

ఆమెనా స్థితిలోంచి, మనుష్యుల్లోంచి కొండన్న పొదివిపట్టుకుని బయటకి తెస్తూండగా, గుమ్మడి పూల ఉనికి ఆమెకి తన పెళ్ళి ముందు రోజు రాత్రిని గుర్తుకి తెచ్చింది.

వీధి గుమ్మం ముందు పెద్ద రథం ముగ్గువేయడం పూర్తి చేసి, రంగులద్దుతూ... అరుగు మీద కూర్చుని దీపం వెలుగులో 'మను చరిత్ర'ని చదువుతూన్న తండ్రితో కదిపిందామె తన పెళ్ళి విషయం.

"అతన్ని ప్రేమించాను" అని ఆమె అన్నప్పుడు ఆయన నుదుటి ముడుత బిగుసుకుంది.

అయితే కూతురి వ్యక్తిత్వం, పట్టుదల ఆయనకి తెలీనివి కావు.

"నేను కాదంటే..." అడిగాడాయన.

"క్షమించండి నాన్నా... " తలవంచుకుంది.

... ఆయన క్షమించాడు. అయితే అన్నాడు "తల్లీ, ఊళ్ళో నేను పెద్ద మనిషినమ్మా. ఇంట్లో నీసమెత్తు విలువ లేనివాడిని. నిన్ను అవునని ఆ మాత్రం గౌరవాన్ని కూడా పోగొట్టుకోలేను. నీ ఎన్నిక మంచిదేనని నా ఉద్దేశ్యం. అయితే నీ వివాహానికి ఆమోదం తెలిపి అందరి దృష్టిలో నియమాలొదులుకున్నవాడిగా ముద్ర వేయించుకోలేను. అందుకే.... ఆయన నెమ్మదిగా అన్నాడు "... నీ ఇష్టప్రకారమే వివాహం చేసుకున్నా, ఈ విషయం కనీసం నాతో చర్చించినట్టు కూడా ఎవరితోనూ అనకు. ఇదేనమ్మా నీ ఈ పిరికి తండ్రి కోరే చివరి కోరిక. అయితే పెళ్ళయ్యాక ఆ పసుపుబట్టల్లో ఇక్కడికి రా తల్లీ! నిన్నా అలంకరణలో చూడాలని ఎప్పటి నుండో కోరిక..."

మసక వెల్తుర్లో కళ్ళలోని నీటి తెర ఆయనకి కన్పించకుండా ఆమె ఆయన పాదాలకు నమస్కరించింది. "రేపే నాన్నా! సంక్రాంతికే నా పెళ్ళి"

తెల్లారి... ప్రత్యూష కిరణం భూదేవి పాపిట ఎరుపద్దుతున్న వేళే... దేవుని కుంకుమ ఆమె నుదుట దిద్ది సాగనంపాడాయన.

*   *   *

యజ్ఞనారాయణ పోతూ పోతూ తన ఆస్తిలో సగభాగం గాయత్రి పేర రాసాడట. ముసలాయనకి చివరి దశలో మతి భ్రమించిందేమో అని మూడోసారి ఊరు ఊరంతా మరొక్కసారి గుప్పుమంది.

MUKKAMALA

SRI LAXMI NAVENA JEWELLERY MART

ఖాతాదారులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలతో

*Proprietor:* **Chilaka Srinivasa Rao**

Shop No: 4, Radhakrishna Complex,
Sivalayam Street, **Vijayawada-520 001**
**Phone: 67973**